# దూరతీరాలు ఎంతదగ్గర

ఆనాటి మధ్యాహ్నం చిన్న తుంపర పడుతోంది. లాబరేటరీలో 'గబ్బు కంపు, వదలని చీకటిని తలచుకుంటే గది కదలి బయటికి పోవాలని మనస్సు కలగడం లేదు. అల్మరాలోని సిగరెట్టు తీసి ముట్టించాను. 'బంగారు' తలుపు తోస్తూ "నాకు తెలుసు నువ్వుకూడా ఎగవేస్తావని" అన్నాడు. 'కాంటీనుకు పోదాం పద' అన్నాను. మఫ్లర్ ఒకటి తలకుచుట్టి తాళం చెవులు విప్పుకుంటూ బయలుదేరాను. తోవలో ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటూ గమ్యస్థానం చేరాం. వేడి వేడి కాఫీ తాగుతూ బంగారు అన్నాడు. "ఈవాళ సిటీలో ఏదైనా పిక్చరుకు పోదాం" అని. నేను రానని తలఊపేను. "ఏం?" అన్నాడు. "నేను సరాసరి పోయి వెచ్చగా పడుకుంటాను."

"పడుకొని?"

"మంచి మంచి అమ్మాయిల్ని గురించి కలలుకంటాను."

"అసలు అమ్మాయిలలో మంచివాళ్ళు ఉన్నారంటావా?" అడిగేడు.

"నా పరిచయంలో ఇంతవరకూ లేరనే చెప్పాలి. అంచేత ఏ బెంగాలీ అమ్మాయిని గురించో లేక స్విట్జర్లెండులో 'ఆల్ప్స' మంచుకొండలలో ఒక ఫ్రాలీన్ గురించో..."

"అదంత మంచిపనికాదు. సినీమా స్టార్లు అంతకన్నా నయం అని నా ఉద్దేశం"

"మహారాజ్! నువ్వేమంటావు?" అన్నాను కాంటీను ప్రొప్రైటరుతో.

"బాబూ! మీరు వేగరం పెళ్లి చేసేస్కోండి." అన్నాడు చాలా విచారంగా ముఖంపెట్టి కాంటీనువాడు. బంగారు గట్టిగా నవ్వాడు. నేన్నా సలహాని చాలా తీవ్రంగా ఆలోచిస్తానని మహారాజ్‌కి వాగ్దానం చేసి బయటికి నడిచాను. తుంపర మెల్లిగా జల్లుకింద మారింది. ఇద్దరం నాగదికి చేరుకోనేసరికి కారుమబ్బులు జోరుగా కమ్ముకొని వర్షం ఏకధారగా కురవడం మొదలుపెట్టింది. కిటికీతలుపులు మూసి ఉన్ని కోటుతీసి తొడుక్కున్నాను. బంగారు "నీకో ఉత్తరం వచ్చిందోయ్" అన్నాడు. ఆ అనడంలో అదోమాదిరి అనుమానంగానే అన్నాడు. నేను కనుబొమ్మలు ఎగరేశాను - దాన్ని చింపి లోపలి కాగితాలు విప్పేడు. "నే నిది చదవకూడదనుకుంటాను." అంటూ నాకిచ్చేశాడు. అలా అంటూనే సగందాక చదివేడని నాకు తెలుసు. నేను నవ్వుతూ చదవడం ఆరంభించేను.

## వై. రఘునాథరావు

"...నువ్వు సెలవుల ఆఖరున కాశీ వెళ్లకముందు విశాఖ వచ్చావని గోపీ చెప్తున్నాడు. వాడు నిన్న మినర్వాలో 'బర్సాత్' సినీమా రెండో ఆట 'ఇంటర్వెల్'లో చూశాడట. సినీమా ఆఖరిని హాల్లో నువ్వు మరి కనిపించలేదట. మామీద నీకెందుకింత నిర్దయ? ఇంటికొచ్చి ఒకసారి కనుపిస్తే అమ్మ నిన్ను పెళ్ళివిషయంలో బలవంతం చేస్తుందనా? పోనీలే, నాన్న ఇక్కడ కాలేజీలో బి. ఏ. (ఆనర్సు) చదువుతున్న ఓ అందమైన అబ్బాయికిచ్చి ఐదువేలు కట్నమైనా సరే పెళ్ళి చేస్తానంటున్నారు. నాకేం పెళ్ళికొడుకులకి తక్కువా? అదుగో - నాకు తెలుసు నీకప్పుడే కోపం వస్తోంది. మరి మా ఊరువచ్చి నాతో చెప్పకుండా ఎందుకు వెళ్ళిపోయావు? అమ్మకి అప్పుడప్పుడు కడుపునొప్పి వస్తోంది. గోపికి ప్రతి బుధవారం చెవి పోటు పెడుతోంది. నాన్నకి ఆఫీసులో నిద్ర లావయిపోయింది. ఇంట్లో అంతా ఇలా చికాకుల్లో ఉన్నాం."

బంగారు తెగనవ్వుతూ "ఇది ప్రేమ

FPY. 26-TEL

'నా గొంతుక బాగా పుండు పడినందున నేనుమ్రింగలేక పోయాను'

కాని **పెప్స్**

ఉపశమనం కలిగించి పుండును మాన్పినవి



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన నివారకసారములు కలవి, మీరు పెప్సును చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి పరాపరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణచివేస్తాయి, గొంతు పుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయెంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.




**PEPS**

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.

మద్రాసు సోల్ ఏజెంట్లు: దాదా & కంపెనీ, పార్కుటౌన్, మద్రాసు-3.



# ★ దూరతీరాలు ఎంతదగ్గర ★

రేఖా, స్నేహలేఖా, చాకలిపద్దా......" అంటున్నాడు. పద్మ రాసుకుపోతోంది - "మా పొరుగున ఉన్న లలిత అనే అమ్మాయి నిన్నరాత్రి ఎవరితోనో లేచిపోయింది. మా అందరికీ కూడా యీ వార్త......"

తరువాత అక్షరాలు నాకు మరి కనిపించలేదు. గదంతా నల్లగా నా ముందు తిరిగింది - బంగారు నా వళ్లు పట్టుకొని గట్టిగా ఊపేదాకా నాలో మరి చలనం లేదు. నా ముందు నీరసంగా లేఖ క్షమాపణ కోరుతూ పడివుంది. అలా ఎంతసేపు కూచున్నానో నాకే తెలీదు. నా కనుకొలకుల్లో రెండు నీటిబిందువులు పొంగాయి. వాటిలోంచి క్రమంగా నా దృక్పథంలో గతించిన నా జీవితపు దూరతీరాలు దగ్గరదగ్గరగా రాసాగినై.

లలిత...లలిత...పద్మా! నువ్వా పేరు ఎంత అజ్ఞానంగా వ్రాసేవు! ఈ ఒక్క పేరు ఒక కల అని భావించటానికి ప్రయత్నం చేస్తున్న నా పూర్వ స్మృతులన్నీ ఒక్కొక్కటే నా కళ్లముందర గోచరించడం మొదలు పెట్టాయి.

* * *

ఆనాడు నేను నా "స్పెక్ట్రోస్కోపు'తో అవస్థలు పడుతున్నాను. మా ప్రొఫెసరు వచ్చి "మిష్టర్ రావ్! ఈ విద్యార్థిని ఇవాళ నుంచి నీ ఛార్జిలో వుంచుతున్నాను. ఈమెకో ప్రాబ్లెమ్ తయారుచేసి గైడెన్స ఇస్తూవుండు." అని చెప్పి నా కామెను పరిచయం చేసి వెళ్ళిపోయాడు. నేను చికాకుగా తలతిప్పి ఆమెను ఓ కుర్చీలో కూర్చోమని మళ్ళీ నా పనిలో మునిగిపోయాను. చాలా కాలం గడిచింది. నా కాకలి వేసింది. టైము ఎంతయిందో తెలీదు. తిన్నగా టీ క్లబ్‌లోకి పోయాను. టీ గొంతులో పోసుకొని సిగరెటు [illegible] పోయాను. అక్కడ బంగారు కనుపించాడు. ఇద్దరం పావుగంట బాతాఖానీ వేశాం. అతడితో నాయీ సరికొత్త ఇబ్బంది చెప్పుకున్నాను.

"ఒకేయ్. స్పెక్ట్రోస్కోపీ అంటున్నావు; లలిత అయివుండదు కదా?" అన్నాడు.

"ఏ లలిత?" అని అడిగేను.

"లలిత తెలీదూ? మా ఊరి అమ్మాయిరా"! అన్నాడు.

"ఓహో! మీ ఊరు లలితా?" అన్నాను.

"అదికాదురా. అమ్మాయి ఎలా వుంటుందో చెప్పు."

"చామనఛాయగా సన్నగా వుంటుంది. చూపులు మాత్రం జీవితంలో ఏదో పోగొట్టుకున్న దానికి మల్లే......"

"నీకూ అలాగే అవుపించిందీ. ఆమెను చూసినవాళ్లంతా అలా అనడమే గాని ఆమెను అర్థంచేసుకొని సానుభూతి చూపించిన వాళ్లు ఒకరూ లేరుగదా!"

"నేనింకా ఆమెని ఏమీ అనందే?"

"అదే అదే మరో మూడురోజులు పరిచయమయాక నువ్వూ ఆ నిశ్చయానికే వస్తావని నాకు తెలుసు."

"ఏ నిశ్చయానికి?"

"మరి నాలుగు రోజులతర్వాత ఆ ప్రశ్న అడుగు"

బంగారు మరేమీ నాతో చెప్పదలచుకోలేదు. బంగారు వెళ్ళిపోయిన అయిదునిముషాలదాకా ఆ అమ్మాయి స్వభావంగురించి ఊహాగానం చేశాను. ఆ అమ్మాయినిగురించి నాలో లేని కుతూహలాన్ని బంగారు నాటి వెళ్ళిపోయేడు. మరో కప్పు టీ తీసుకొని లాబ్ లోకి పోయేను. లోపల చాలా చీకటిగా వుంది. స్విచ్ వేశాను. నే నే కుర్చీలో కూర్చొమన్నానో ఆ కుర్చీలో అలాగే ఆ అమ్మాయి కూర్చొని ఉంది. కొన్ని క్షణాలదాకా నే నేమీ మాట్లాడలేకపోయేను ఈ మూడు గంటల కాలం అలాగే... ఆ కుర్చీలో నే... ఆమెను గురించి నే నేమనుకోవాలి?

"మీరు యింతసేపూ అలాగే ఎందుకు కూర్చున్నారు? మీరు వెళ్ళిపోయే రనుకున్నాను" అన్నాను ఆఖరుకి.

"నా ప్రాబ్లెమ్?" అంది.

"రేపు తయారుచేసి ఇస్తాను" అన్నాను.

నేను మళ్ళీ నోరు విప్పేలోపున ఆమె వెళ్ళిపోయింది. నాకు చాలా చికాకు వేసింది. నేను మరో పావుగంటసేపు నా పనిలో నిమగ్నమవడానికి వృథాప్రయత్నం చేసి పూర్తిగా ఓడిపోయి లాబ్ కి తాళం వేసుకొని బయటికి నడిచాను. సైకిలుమీద షికారు పోతూంటే తోవలో రోడ్డంతా వదలి చెట్ల నీడల్ని అంటిపెట్టుకొని గబగబా ఆమె హాస్టల్ కి నడచిపోతోంది. పక్క నే రోడ్డుమీదనుంచి నలుగురు మళయాళీ అమ్మాయిలు పకపక నవ్వుతూ అరఫర్లాంగుదూరం దాకా వినపడే గొంతుకలతో అరుస్తూ పోతున్నారు. ఈ తారతమ్యం నా హృదయంలో అనాలోచితంగా నాటుకుంది. విశ్వవిద్యాలయం గోడలు దాటి నదీ తీరం వైపు పోయేను. క్రమంగా కమ్ముకున్న సంజె చీకట్లను మల్లే నా భావాలు కూడా దూరదూరంగా పాకి మసకగా పారేయి.

మర్నాడు సాయంత్రం నాలుగు గంటలకి ఆ అమ్మాయి మళ్ళీ నా గదిలో ప్రవేశించింది.

"అరెరె! మీ సంగతి పూర్తిగా మర్చిపోయేను రేపు తయారుచేసి ఇస్తాను..." నా మాట పూర్తి కాకుండానే ఆమె మళ్లీ వెళ్ళిపోయింది. మరో అర గంటకి మా ప్రొఫెసరు వచ్చేరు "మిస్టర్ రావ్! ఆ అమ్మాయికి మీ రివేళ ప్రాబ్లెమ్ తయారుచేసి ఇస్తానని చెప్పి అలా చెయ్యలేదట. కారణం?" అని అడిగేరు. నేను మర్చిపోయేనని ఆయనతో ఎలా చెప్పడం?

"ఈ అమ్మాయి చాలా పట్టుదల మనిషిలా నా కగుపించింది. అంచేత కాస్త ఆలోచించి కొంచెం ఆలస్యమైనా మంచి పటుత్వమున్న సమస్య ఇద్దామని ఆలోచిస్తున్నాను" అన్నాను. ఈ అబద్ధానికి నా ముఖం బాగా కందింది. "ఓ అదా! తప్పకుండా. తప్పకుండా! అందుకే ఆమెను నీ చార్జిలో వుంచేను. మిగతా విద్యార్థులలాగ కాక ఈమెలో నాకో ప్రత్యేకత కనుపించింది. అన్నట్టు మీ ఇద్దరిదీ ఒకటే భాష కదూ!" నా జవాబుకోసం ఎదురుచూడకుండానే "ఆమె ప్రాబ్లెమ్ తయారుచేసేక నా కొకసారి చూపించు" అంటూ ఆయన వెళ్ళిపోయేరు. నాకు చాలా కోపం వచ్చింది. ఏదో జాలిగా ముఖం పెడితే ఉత్తి అమాయకురా లనుకున్నాను గాని, ఇలా ప్రవర్తిస్తుందని నే నెప్పుడూ ఊహించలేదు. ఆ మర్నాడే స్పెక్ట్రోస్కోపీ మీద ఒక ప్రాబ్లెమ్ తయారుచేసి ప్రొఫెసర్ కి చూపించేను. ఆయన బాగుందన్నాడు.

ఆనాడు సాయంత్రం ఆమె వచ్చింది. "నే నొక్క రోజు ఆలస్యం చేస్తే ప్రొఫెసర్ తో పోయి చెప్పవలసిన అవసరం మీ కేం వచ్చింది? ఇదిగో మీ ప్రాబ్లెమ్ విధానం కూడా అందులో సూచించేను" అంటూ ఆ కాగితాన్ని ఆమెముందున్న బల్లమీదకి విసిరి నేను జోరుగా బయటకి నడచి వచ్చేశాను. ఇదివరకటికిమల్లే ఆమెను ఏడిపిద్దామని రాత్రి ఏడు గంటలకి నా గదికి వచ్చేను. లైట్లు వెలగడం లేదు. స్విచ్ వేసేను. ఆమె ఆ గదిలో లేదు. ప్రాబ్లెమ్ కాగితాలూ లేవు. నే నొదిలిన వస్తువులు ఎక్కడి వక్కడే అలాగే పడి వున్నాయి. తలుపులు అలాగే తీసివున్నాయి.

మర్నాడు సాయంత్రం ఆమెను అడిగాను: "నేను వెళ్ళిపోయిన తరువాత అన్ని విలువైన సామానులన్నీ వదిలేసి తలుపులైనా చేరవేయకుండా మీ రెందుకు వెళ్ళిపోయేరు? మీ ప్రవర్తన నా కేమీ..."

"నేను మీ నౌఖరును కాను" ఈజవాబు ఎక్కడినుంచి వచ్చిందో కొంతసేపటివరకూ నాకు తెలీలేదు. నా నోరు అలాగే తెరుచుకొని ఉండిపోయింది. నా ముఖం రంగు బాగా నే నల్లబడిందని చెప్పొచ్చు. కొంచెం తేరుకున్నాక ఆమెను తీక్షణంగా చూస్తూ "ఈ వేళ ఎంత ఆలస్యమైనా సరే ఇందులో స్పెక్ట్రమ్ వచ్చేటట్టు చేసి నాకు చూపించి వెళ్ళాలి. లేకపోతే ప్రొఫెసర్ గారితో రిపోర్టు చేస్తాను" అన్నాను దీని కామె జవాబు యివ్వలేదు. తిన్నగా స్పెక్ట్రో మీటర్ దగ్గరికి పోయింది.

గంటన్నర గడిచింది. నేను చేసుకుంటున్న కాల్క్యులేషన్ వదలి ఆమెవైపొక్కసారి తిరిగేను. స్పెక్ట్రమ్ కోసం ఇంకా తంటాలు పడుతోంది. "ఆమాత్రం తెలీనివాళ్ళు యం. యస్ సీలు చదవడానికి రావడం దేనికో. జరగండి నేను తెప్పిస్తాను" అని ఇన్స్ట్రుమెంట్ తీసుకున్నాను. ఆమె కళ్ళు చెమ్మగిల్లినట్లు నాకు కొంచెం అనుమానం వేసింది. ముందు ఐదు నిముషాలలో వచ్చేస్తుందన్నట్టుగా నేను మరని అటూ ఇటూ కొంచెం హుషారుగా నే తిప్పేను. కాని అనుకున్న ఫలితం ఏమీ కలగలేదు. తరువాత కొంచెం జాగ్రత్తగా ప్రయత్నంచేసి చూసేను. అప్పటికీ ఏమీ ఫలితం కలగలేదు. నాలో ఉడుకుమోత్తనం, పట్టుదల లావయ్యేయి. ఒక్క గంట తర్వాత స్పెక్ట్రమ్ వచ్చింది. 'హమ్మయ్య' అని నిట్టూర్చి రుమాలుతో కళ్లు కొంచెం వత్తుకుని వంగిన నడుము మూడు నాలుగుసార్లు గుంజ సరి చేసి అట్టహాసంగా "ఇదిగో చూడండి" అంటూ వెనక్కి తిరిగేను. లలిత బదులు బంగారు జాగ్రత్తగా ముందుకు వచ్చి టెలిస్కోప్ లో ఓ కన్ను దూర్చేడు. "అరె! నువ్వా! ఆమె ఏదిరా?" అన్నాను. "ఎవరూ?" అన్నాడు. "మీ విశాఖపట్నం అవతారం." బంగారు ఉద్బేత్తుగా నవ్వడం మొదలు పెట్టేడు. "అదంతా సరేగాని ముందు నీ దుకాణం అంతా కట్టుకొని నా వెంట పద. లంకకి పోదాం" అన్నాడు. వాడి సలహా మన్నించేను. అయ్యరు హోటల్లో కాఫీ తాగి గంగ ఒడ్డుకి పోయి కూర్చున్నాం.

"ఈమె తాతగారికి బోలెడు ఆస్తి ఉండేది" అని మొదలు పెట్టేడు నా భావాల్ని అద్దంలో చదివినట్టు. నేను సిగరెట్టు ఒకటి తగిలించి 'ఊ' అని మూలిగేను. "ఆయనకి ఈమె తండ్రి ఒక్కడే కొడుకు. దాని ఫలితం నువ్వు ఊహించుకోవచ్చు. ఆయన పోయి ఈయన చేతిలోకి ఆస్తి వచ్చే సరికి, ఈయన పక్కా జూదగాడు, తాగుబోతు అయేడు. ఈమె తల్లి ఈమెని చాలా గారాబంగా పెంచేది. ఈ అమ్మాయి పన్నెండో ఏడు ప్రవేశించి, జీవితంఅంత ఒక తియ్యటి కల అని భావిస్తుండేరోజుల్లో తల్లి హఠాత్తుగా మరణించింది. ఆయన రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె కారానికి వచ్చిన తర్వాత తన తండ్రి ఆస్తిని ఊహించి తన గొంతు కోసేడో ఆస్తిలో పదోవంతైనా మిగలలేదని గ్రహించడానికి అట్టే కాలం పట్టలేదు. ఆమె చాలా తెలివితేటలు గలది. ఈయన ఏ

# దూరతీరాలు ఎంతదగ్గర

మైనా తాగుతే ఆనాడే ఉరిపోసుకు చస్తానంది. దానితో ఆయన తాగుడు మానకపోయినా చాలావరకు తగ్గించేసేడనుకోవచ్చు. రాత్రుళ్ళు ఇల్లు కదులుతే తను పుట్టింటికి పోతానంది. దీనితో జూదం కూడా ఏ ఆదివారమో తప్ప మిగతా రోజుల్లో కొనసాగడం కష్టం అయింది. ఇక లలిత విషయంలో......ఆమె తెలివితేటలు గలదని చెప్పేనుగా! ఆమె లలితను ఏమీ అనేదికాదు. అలా అని గారాబంగా చూసేదని అపోహపడవద్దు. లలితకు ఏమి కావలసివచ్చినా తల్లిని అడిగి తీసుకోడం అలవాటు. ఆమె ఎప్పుడూ తండ్రిని అడిగి తన అవసరాలు తీర్చుకొనేది కాదు. ఇప్పుడు లలిత చాలా చిక్కులో పడింది. విధిగా రెండు మూడుసార్లు తండ్రితో సొమ్ము విషయమై ప్రస్తావించింది. ఆయనకి ఈమె ఆవిధంగా అడగడం ఏదో వింతగానూ, అతని నిత్యబద్ధకానికి అంతరాయంగానూ తోచింది. 'పోయి పిన్ని నడుగు' అన్నాడు. పిన్నిదగ్గరికి వెళ్లడానికి రెండు మూడుసార్లు సంకోచించి, చివరికి అడిగింది. ఆమె వెంటనే ప్రశ్నించింది.

'ఎందుకు?' అని. ఇటువంటి ప్రశ్న లలిత జీవితంలో వినడం ఇది మొదటిసారి. దీనితో లలితకు ఏవి అవసరమో అవే ముట్టేవి. విలాసాలు కరువైపోయాయి. క్రమంగా లలితజీవితంలో మార్పు రాసాగింది. ఆకురాలు కాలంలో చెట్టు నిస్సహాయంగా పడిఉంటుంది. ఒక్కొక్క ఆకే చెట్టునుంచి రాలిపోతూంటుంది. చివరకి మోడు ఒక్కటే మిగుల్తుంది. చుట్టూ చలీ, మంచూ—అలా అని చెట్టు చావదు. హేమంతంలో దానిలోని కోరికలన్నీ ఏ మూలకో పోయి, తాత్కాలిక సుషుప్తిలో వుంటాయి. హేమంతం గడిచిపోతుంది, వసంతమారుతాలు సోకుతాయి—మళ్ళీ చెట్టు చిగురుస్తుంది, పూస్తుంది, కలకలమని నవ్వుతుంది. అప్పుడు నవ్వుదూచే చెట్టుకీ, హేమంతంలోని మోడుకీ పోలిక కనుపించదు. నువ్విదివరకు చూసింది ఓ పాడు రెండ అని భావిస్తావు అంతే - లలిత జీవితంలో యింకా వసంతపవనాలు సోకలేదు. ఆమె హేమంతంలోనే ఈ ఆరేడు ఏళ్లూ గడిపింది. నీకిన్ని వివరాలు ఎలా తెలుసును? అని నన్ను అడుగుతావని నాకు తెలుసు. మాది వాళ్ళింటి పొరుగిల్లే. మా ండిళ్ళలో జరుగుతున్న ప్రతీ చిన్న విషయం పొరుగువారికి తెలిసి తీరుతుంది. లలిత స్కూల్ ఫైనల్ పరీక్షలో వాళ్ల క్లాసుకు ప్రథమంగా వచ్చింది. హైస్కూలు వాళ్ళు ఆమెకో వెండికప్పు బహుమానం చేసేరు. ఆ సభకి ఆమె తండ్రిగాని, తల్లిగాని రాలేదు. సభ అయిపోయింతర్వాత ఆమె ఎంతో ఉత్సాహంతో వాళ్ళ నాన్నగారిదగ్గరికి వెళ్ళి కప్పు చూపించింది. ఆయన అప్పుడు పేకతో పేషెన్స్ ఆడుకుంటున్నాడు. ఆమెనీ, కప్పునీ ఒకసారి చూసి 'పిన్నికి చూపించు' అని మళ్ళీ ఆమె వైపు తిరగలేదు. ఆమె సంతోషం సగం చచ్చింది. పిన్నిదగ్గరికి పోయి 'ఇదిగో నాకిచ్చిన ప్రైజు' అంది. 'ఓ! బాగుంది. నేనిప్పుడు సినీమాకి పోతున్నానని నాన్నగారితో ఆయన పేకాట అయింతర్వాత చెప్పు.' అని ఆవిడ వెళ్ళిపోయింది. ఇదంతా జరుగుతున్నప్పుడు నా చెల్లెలు ఆమెవెంట ఉంది. ఆరాత్రి చాలాసేపు లలితని నా చెల్లెలు ఓదార్చవలసి వచ్చింది. లలితకి చదువుమీద ఆసక్తిపోయింది. మరి చదవనని గట్టిగా చెప్పింది.

కాలేజీ తెరిచేరోజున ఆమె తండ్రి వెళ్లి జీతం కట్టివచ్చేడు. పదిగంటలకి జట్కావాడు వచ్చి 'అమ్మగారూ!' అని పిలిచేడు. 'ఎందుకురా?' అంది. 'బాబుగారు మిమ్మల్ని కాలేజీకి రోజూ తీసుకవెళ్ళమన్నారండి' అన్నాడు. ఆమె విస్తుపోయింది. గబగబా వాళ్ళ నాన్నగారి గది దగ్గరికి నడిచివెళ్ళింది. అతడు కళ్ళజోడులోంచి తీక్షణంగా చూస్తూ 'ఏం?' అన్నాడు అంతే. మా చెల్లెలి వెనకాలే జట్కా ఎక్కింది. లలిత కాలేజీలో చదివిన నాలుగేళ్ళూ తోటి అమ్మాయిలతోనే చాల ముక్తసరిగా మాటాడేది. ఆమెలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పుని వాళ్లంతా గర్వమని అర్థం చేసుకున్నారు. విద్యార్థులు వాళ్ళ సంఘంలో సభ్యరాలుగా చేరమని చందాకోసం వస్తే ఆమె నిరాకరించింది. దానితో వాళ్లకి కోపం వచ్చింది. చివరకి లలిత కాలేజీ గ్రూపు ఫోటోకి కూడా వెళ్లేదికాదు. ఆమె నాలుగేళ్ల కాలేజీ జీవితంలోనూ, క్రమంగా వృక్షం ఆకులన్నీ ఒక్కొక్కటే రాలిపోయాయి. చివరకి మోడు మిగిలింది. లలిత బి. యస్‌సి. చాలా బ్రిలియంట్‌గా ప్యాసయింది. ఈ ఫలితం ఆమె ఊరివాళ్ళనిగాని, ఆమె తల్లిదండ్రులనుగాని, చివరికి ఆమెను కూడా సంతోషపెట్టలేదు. ఆమాటకొస్తే ఆమె పరీక్ష పోయినా కూడా ఎవరూ విచారించి వుండేవారుకారు. శలవుల్లో ఆమెకు పెళ్ళిచేద్దామని వాళ్ల నాన్న కొన్ని ప్రయత్నాలు చేసేడు. కాని అవి కొనసాగలేదు. ఇంతలో లలితపిన్నికి ఆకస్మికంగా ఒక ఆలోచన మెరుపులా తోచింది. ఆమె పినతల్లి కొడుకొక ఆయన కలకత్తాలో యం. బి. బి. యస్ చదువుతున్నాడు. అతడికిచ్చి పెళ్ళిచేస్తే? వాళ్ల నాన్న వెంటనే ఆయనకో వుత్తరం, లలిత ఫోటో పంపించేడు. అతడు వచ్చే ఏడు తన చదువు పూర్తి అవుతుంది; అప్పుడు ఆలోచిద్దాం అని ఆరురోజులు ఆలస్యంచేసి జవాబు రాసేడు. మళ్ళీ జూలై వచ్చింది. లలిత వాళ్ల నాన్నతో ఇక్కడ యం. యస్‌సి. చదువుతానంది. ఆయన 'నీ కెవడు సీటిస్తాడు' అన్నాడు. 'ఇదివరకే ఎప్లై చేసేను. సీటు దొరికింది' అన్నదామె. 'నీకు ప్రతి నెలా అంతంత సొమ్ము నేను పంపించలేను' అన్నాడాయన. 'పిన్ని కిందటినెల వెళ్ళి తీసి తెచ్చుకున్న ఆమె ఇద్దరు తమ్ముళ్ళనీ ఇక్కడ హైస్కూలులో చేర్పించకుండా వాళ్ల ఇంటికి పంపించేసెయ్యండి.' 'అది నీకనవసర ప్రసంగం'. అన్నాడాయన ఆఖరుసారిగా. ఆపూట ఆమె అన్నం తినలేదు. ఈమాట మా వీధిలో పాకింది. వాళ్ల పిన్ని మరి మనుకుందో ఏమో లలితను కాశీ పంపించే ఏర్పాటు చేసింది. ఇప్పుడిక్కడ చదువుతున్నది లలిత కాదు. ఆ మోడు. కాని నాకు బాగా తెలుసు. ఆమె జీవితంలో వసంత పవనాలు వీచి తీరుతాయి. ఆ మోడు అప్పుడు కిలకిలా నవ్వుతుంది. అల్లరి చేస్తుంది. జీవితం అంతా ఓ తియ్యటి కల అని మళ్ళీ ఆనందిస్తుంది. ఆరోజు లెప్పుడంటావా? ఏమో? ఎప్పుడో? ఎక్కడో? నేనెలా చెప్పగలను? అందుచేత లలితను అపార్థం చేసుకోకు బ్రదర్! అపార్థం చేసుకోకు...."

ఆ చిక్కటి చీకట్లో వాడి మొహం నాకు కనుపించలేదు. కాని గొంతుక మాత్రం బొంగురుపోయింది. శ్రావణమాసపు నీటి గాలికి నా చొక్కా కాలరు రెపరెపలాడుతోంది. నీటిలో ఆడుకుంటున్న నక్షత్రాల నీడల్ని చూస్తూ తాపీగా అడిగేను. "నువ్వామెను ప్రేమిస్తున్నావా?"

జవాబు చెప్పడానికి కొంతకాలం తీసుకున్నాడు. "లేదు" అన్నాడు చివరికి... "నాలో ఆమెగురించి అటువంటి భావన ఎప్పుడూ కలుగలేదు."

"ఆమెతో నీకు పరిచయం ఉందా?"

"ఆమెకు నేనెవరో తెలుసు. కాని నాతో ఎప్పుడూ మాట్లాడలేదు." నేనీ జవాబుకి ఆశ్చర్యపడలేదు. నదిలో పడవ సరంగెవడో సన్నగా పాడుతున్నాడు.

"నువ్వెవరిదానవో నే నెరుగనో గంగా,
నవ్వకే మరి నామనసు విరిగనే ఓగంగా"
పాట క్రమక్రమంగా దూరమైపోయింది.

ఒడ్డున కట్టిన పడవలమీద నీటి కెరటాలు తుప్పుతుప్పుమని తట్టుతున్న శబ్దం ఒక్కటే మిగిలింది. చలి లావయింది. ఇద్దరం లేచాం, కాని నాకా చోటు వదలాలని లేదు.

పక్కమీద పడుకుంటాల్సిన కొద్ది సేపటిలోనే నాకు గాఢంగా నిద్రపట్టింది. నా చుట్టూ నీలంగా ఉంది. అందులోంచి పద్మ నవ్వుతో కనుపించింది. కాదు పద్మ నవ్వు మాయమవుతోంది. ఒక చామన ఛాయ ముఖం. అందులోంచి జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్టున్న విశాల నయనాలు నాకు కనుపించేయి. అవికూడా క్రమంగా అంతరించేయి. నాచుట్టూ మంచు, మధ్యను ఒక మోడైపోయిన చెట్టు. నా చెవిలో గాలి ఈరికే రొదచేస్తోంది. క్రమంగా గాలి మారింది. మంచు కరుగుతోంది. ఆ మోడు మళ్ళీ చిగురుస్తుంది. ఆమోడు మళ్లీ...... నా చెవిలో గాలి గోలచేస్తోంది. కళ్లు విప్పేను. కిటికీతలుపులు తీసేఉన్నాయి. బయట భారీగా వర్షం కురుస్తోంది. కిటికీలో పద్మ ఉత్తరం పూర్తిగా జల్లుకి తడిసింది.

ఆ మర్నాడు ప్రొద్దున్న నేను చాలా ఆలస్యంగా లేచాను. అప్పటికి వర్షం వెలిసింది. కాని మబ్బుల్లోంచి సూర్యుడు ఇంకా బయటికి రాలేదు. ఆ చలిగాలిలో పళ్లు తోముతున్న నన్ను చూసి మా హోస్టలు క్వాడ్రాంగిల్ లో వున్న గులాబీలు తల లూపుతూ నవ్వేయి.

ఆవేళ ఆమె రాగానే నేను పరిచేసి తెచ్చిన స్వెట్టర్ని చూసింది. సంతృప్తితో ఆమె కళ్లు మెరిసేయి. "స్వెట్టర్ని వచ్చిందా?" అన్నాను నేను. "ఊఁ" అందామె.

"నేను కొన్ని కాల్కులేషన్స్ – చేసుకొంటున్నాను. నాకు కొంచెం సాయం చేసి పెడతారా?" అని అడిగేను.

"సారీ" అంది.

"అబ్బే దానికేంలెండి" అన్నాను.

ఈ జవాబు ఆమెకి ఆశ్చర్యం కలుగజేస్తుందని నాకు తెలుసు. కొంచెంసేపు తటపటాయించి నాదగ్గరికి వచ్చింది. ఆమె చేతిలో లాగ్ టేబుల్స్ ఉంచేను. కాల్కులేషన్స్ పూర్తి అయేసరికి చీకటిపడింది. "టీ తీసుకుందాం రండి" అన్నాను. ఆమె మాట్లాడలేదు. నౌకరును కేకవేసేను. "రెండు టీ కప్పులు యిక్కడికి తీసుకురా" అన్నాను.

"నాకు వేళయిపోతోంది నేను పోవాలి" అని ఆమె జవాబుకు ఎదురుచూడకుండా వెళ్ళిపోయింది. మర్నాడు సాయంత్రం మళ్ళీ టీకి ఆర్డరిచ్చేను.

"నిన్నటు మీకోసం తెప్పించిన టీ అలాగే చల్లగా పడిఉంది. ఇలా రోజూ నాకు అణన్నర దండగ చెయ్యకండి. పేద వాణ్ణి" అన్నాను, నవ్వుతూ. "మిమ్మల్ని టీ ఎవరు తెప్పించమన్నారు?" అని ఆమె అడగలేదు. బుద్ధిగా కుర్చీలో కూర్చుంది. టీ వచ్చేదాకా ఆమెతో నేనేమీ మాట్లాడలేదు. టీ తాగుతూ "పంచదార కొంచెం ఎక్కువ వేసేడు" అన్నాను. అవునని తల ఊపింది. ఆ మర్నాడు అవునని నోటితో అంది.

నాలుగురోజుల తర్వాత టీ క్లబ్బుకి ఇద్దరం కలిసివెళ్లేం. అందులో టీగురించి, టీ తయారయే డార్జిలింగుగురించి, టీ కాఫీల వ్యత్యాసాలగురించి, పరీక్షలలో వాటి లాభనష్టాలగురించి తీవ్రంగా చర్చించేం. కొన్ని రోజులు గడిచేయి...

ఒకనాడు వర్షం మధ్యాహ్నం మొదలెట్టి రాత్రి ఎనిమిదిగంటలయినా ఇంకా జోరుగానే కురుస్తోంది. ఇద్దరం లాబ్ లో వణుకుతూ కూర్చున్నాం. అలెగ్జాండరు డ్యూమా కథ ఒకటి ఆమెకు చెప్తున్నాను. ఆమె 'ఊఁ' కొడుతోంది. ఎవరో తలుపు తట్టేరు. లోపలికి రమ్మన్నాను. బంగారు ఒక రెయిన్ కోటు తొడుక్కొని మరొకటి చేతిలోపట్టుకొని బయటినుంచీ "పోదాంపద. నేను లోపలికి వస్తే నీగదంతా..." అప్పుడు లలితను చూసేడు. కొంచెం అటూ ఇటూ అయి చివరికి తొడుక్కున్న కోటు విప్పి తలుపు గడియకి తగిలించి లోపలికి వచ్చేడు. జేబులోంచి రుమాలు తీసి తల తుడుచుకొంటూ "కాస్త టీ యిచ్చుకో బ్రదర్" అన్నాడు. టీలు పూర్తయేదాకా మా ముగ్గురిమధ్యా మాటలు ముక్తసరిగానే వచ్చేయి. నేనే ఆఖరికి తెగించేను.

"ఒక రెయిన్ కోటు తొడుక్కొని మీరు వెళ్లిపొండి. మేమిద్దరం రెండోదాంట్లో పోతాం" అన్నాను లలితతో.

"ఊహూ" అని తల ఊపింది.

"అయితే ఈరాత్రంతా ఇక్కడెలా వుంటారు?" అన్నాడు బంగారు. మొదటి సారిగా ఆమె బంగారువైపు తల తిప్పింది.

"వర్షం వెలిసిపోతుంది" అంది.

"వెలియదు వెలిసినా మరో రెండుమూడు గంటలవుతుంది"

"అవును" అన్నాను నేను. ఆమె నావైపు సంకోచంగా చూసింది.

"నాకు ఆకలేస్తోంది హోస్టల్ కి పోవాలి. కోటు తొడుక్కుంటారా, తొడిగించమంటారా?" అన్నాను. నవ్వుతూ లలిత ఒకకోటు తొడిగింది. నేను గట్టిగా నవ్వేను. "ఏం?" అంది.

"మీరు, మీచుట్టూ మూడు మణుగుల కోటు...మిమ్మల్ని చూస్తోంటే..." లలిత సిగ్గుపడుతూ వెళ్ళిపోయింది.

"ఏంరోయ్! నువ్వూ, నీ రిసెర్చీ, నీ నవ్వూ, నిన్ను చూస్తుంటే..." అందుకున్నాడు బంగారు ఆమె కొంచెందూరం పోగానే. ఎందుకో ఒక్కసారి నా ముఖం ఎర్రబడింది. బంగారు నా అంతరాత్మలోకి సూటిగా చూస్తున్నట్టనిపించింది. "ఒరే నువ్వు నోరు ముయ్యరా" అన్నాను. వాడు నోరుమూసి నవ్వేడు. ఆ చలిలో, ఆ వర్షంలో ఇద్దరం ఒకే కోటులో పోయాం. ఫలితం హోస్టలుకి చేరేసరికి ఇద్దరం పూర్తిగా తడిసేం. తోవలో లలితలోని ఈ మార్పునిగురించి నన్నడిగేడు. "నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష" అన్నాను. ఇంకెంత అడిగినా నాదగ్గరనుంచి జవాబురాదని తెలుసుకోవడానికి వాడికట్టేకాలం పట్టలేదు.

మర్నాడు నాలాబ్ లోకి పార్వతి కోటు తీసుకువచ్చి ఇచ్చింది. "లలితగారేరి?" అన్నాను. "ఆమెకి ఈవాళ కొంచెం జ్వరం తగిలింది. మీరు నిన్నరాత్రి ఆమెకు చేసిన ఉపకారానికి థాంక్స్ చెప్పమంది" అని ఆవిడ వెళ్లిపోయింది. లలితకి వారంరోజులదాకా జ్వరం తగ్గలేదు. ఏదో నాకు పథ్యంతీసుకుంటుంటే పార్వతికిచ్చి కొన్ని బత్తాయిపళ్లు, ద్రాక్షా పంపించేను. అవాళే నేను నా చిన్నన్నయ్య పెళ్ళికి బరంపురం వచ్చేసేను.

పెళ్ళి విజయనగరందగ్గర ఓ పల్లెటూర్లో. విజయనగరం ప్లాటుఫారంమీద నేను అడుగు పెట్టేసరికి మా బంధువులంతా అక్కడే వున్నారు. మేనత్తకూతురు [illegible] నా దగ్గరకొచ్చి రెక్కపట్టుకొని టీ స్టాలుకి లాక్కుపోయింది.

"మాబావకి ఓకప్పు స్పెషల్ టీ" అంది. నన్ను మాటాడనీక, నాతో ఎవ్వరినీ మాటాడనీక ఓ అరగంట గోలచేసి అలిసిపోయింది. "బావా! సినిమాకి పోదాంపద" అంది. నేను రానన్నాను. తిన్నగా మా పెద్దన్నయ్యతోపోయి రిపోర్టు చేసింది. "పోనీ నేను తీసుకెళతాను రాకూడదటే" అన్నాడు.

"అబ్బో అక్కగారు బ్రతకనిస్తుంది" అంది. మా వొదినెకి కోపం వచ్చేలోగా అక్కడనుండి మా నాన్నగారిదగ్గిరకి వెళ్ళిపోయింది.

"దానికి పెళ్ళి కానియ్యవటే?" అన్నారాయన.

తర్వాత పద్మని ఓ అరగంట విడిపించి ఆఖరికి అలాగే అన్నాను.

సినిమా వదిలేసరికి సుమారు పన్నెండయింది. ఇద్దరం జట్కాలో కూర్చున్నాం. పౌర్ణమి చంద్రుని కాంతులు సూటిగా పద్మ

# ★ దూరతీరాలు ఎంతదగ్గర ★

మీద పడుతున్నాయి. ఆ వెన్నెల వెలుగులో ఆ చిన్ని తెల్లనిముఖాన్ని తదేకంగా చూశాను. పద్మ కిలకిల నవ్వింది.

ఆపెళ్లి నాలుగురోజులూ నా జీవితంలో మరువరాని మధురక్షణాలుగా గడిచిపోయాయి. నేను మళ్ళీ ఆ లోకంలోంచి ఈలోకంలో పడేసరికి విజయనగరం ప్లాటుఫారంమీద ఉన్నాను. నేనెక్కిన కంపార్టుమెంటులో నేనొక్కణ్ణే. పద్మ నా సామానంతటినీ పదిసార్లు సర్ది, పదకొండోసారి ప్రయత్నంచేస్తూంటే గార్డు ఈల ఊదేడు. 'బావా' అంది. "ఏం?" అన్నాను. జవాబు వచ్చేలోపల వాళ్ల నాన్నగారు బండెక్కి పద్మ రెక్కపుచ్చుకొని దింపేశారు. "నేను మళ్ళీ ఎండాకాలం శెలవుల్లో వస్తాను..." అన్నాను. బండీ ప్లాటుఫారమ్ వదిలింది. పద్మ అక్కడ జనంలో కలిసిపోయేదాకా అలా చూస్తూనే వున్నాను.

నేను మళ్లీ నా నిత్యజీవితంలో పడ్డాను. దసరాలో నేనూ బంగారు కలిసి ఇళ్లకి వచ్చేశాం. లలిత తనఇంటినుంచి తనకిఉన్ని శాలువ తీసుకరమ్మని బంగారుకి చెప్పింది. చలికాలానికి కావలసిన పూర్తి సరంజా పట్టుకొని నేను దీపావళితర్వాత కాశీ వచ్చేశాను. ఒకనాడు లలితతో "సినిమాకి పోదాం" అన్నాను. రానంది. "ఏం? మీ గార్డెన్ కోప్పడతారా?"

లలిత మాట్లాడలేదు.

"నే నావిడ పర్మిషన్ అడుగుతాను" అన్నాను. అప్పటికీ లలిత మాట్లాడలేదు. అక్కడితో నేనా ప్రసంగం వదిలేసేను. ఆమర్నాడు లలిత "రేపు మేటినీకి పోదాం" అంది. ఆమె దేన్నిగురించి మాట్లాడుతోందో నాకు ముందు బోధపడలేదు. "సరే" అన్నాను ఆఖరికి. సినిమాలో లలిత చాలా ముభావంగా ఉంది. రోజూలాగు నాతో సరదాగా మాట్లాడలేదు. ఏదో పరీక్షలో కూర్చున్న విద్యార్థిలాగుంది.

ఇటువంటి సినిమాలు చాలాసార్లయేయి. ఒకోనాడు బట్టల మార్కెట్టుకి పోయేవాళ్లం. ఒకనాడు ఏదో పండగ అయితే విశ్వనాథునిగుడికి వెళ్ళి తిరిగి వస్తున్నాం. తోవలో గతించిన ఇరవైమూడు సంవత్సరాల జీవితగాథ ఆమెతో చెబుతున్నాను. లలిత ఏదో ఆలోచిస్తూంది. ఆమె బహుశా తన జీవితాన్ని నా చరిత్రతో సరిపోల్చి చూచుకొంటోంది గాబోలు! ఆమెతో అన్నాను, "చూడండీ, ఒక్కొక్క జీవితం ఒక్కొక్కవిధానంలో పోతుంది. ఈ ఇరవై ఏళ్ల పరిమితిలో ఎంతో హాయిగా, కష్టమన్నది తెలియక గడిపినవాళ్లున్నారు. కష్టాలన్నీ యీ కాలంలోనే అనుభవించేసి, జీవితంఅంతా ఇంతేనని నిరాశచెందినవాళ్లూ వున్నారు. ఇరవైఏళ్ళూ అజ్ఞానంలో గడిపి జీవితంలో దశలు ఎప్పటినుండి ప్రారంభం అవుతాయని అడిగినవాళ్లూ ఉన్నారు కాని నేనుమాత్రం గతించినదంతా ఒక కల - రాబోయేది వట్టి నీరెండ. ప్రస్తుతం జరుగుతున్నదే మన జీవితం అంటాను. మీ సంగతి నాకు తెలియదు. కాని నేనుమాత్రం నా భవిష్యత్ నిగురించి ఎప్పుడూ ఆలోచించను. జరిగిపోయిన చరిత్రని మరచిపోవడానికే ప్రయత్నిస్తాను" లలిత మాట్లాడలేదు. నావైపుమాత్రం కొన్నిక్షణాలు నిదానంగా చూసి తల తిప్పేసుకుంది.

క్రమంగా లలితలో మార్పు వచ్చింది. ఆమె ఇప్పుడు నవ్వుతుంది. అల్లరి చేస్తుంది. ఎంతో ఉత్సాహంగా కనిపిస్తుంది. బంగారుకి చాలా ఆశ్చర్యం వేసింది. చలికాలం శెలవులకి నేనూ లలితా కలిసి ఇళ్లకి పోవడానికి నిశ్చయించేం. ఒకనాడు రాత్రి బంగారు నన్ను సూటిగా అడిగేడు. "లలిత మీద నీకున్న అభిప్రాయం ఏమిటి?" అని.

నేను విస్తుపోయేను. ఎంత ఆలోచించినా నాకు జవాబు దొరకలేదు. "నేను చెప్పలేను" అన్నాను నీరసంగా ఆఖరుకి. బంగారు ఈ సెలవుల్లో ఇంటికి వెళ్ళనన్నాడు. మా ఇద్దరినీ రైలుదగ్గర దిగబెట్టి వెళ్ళిపోయేడు. లలిత ఆడవాళ్ల పెట్టెలో కూర్చుంటానంది. నేను వద్దని ఆమె సామాను నా పెట్టెలో పెట్టించేను. రాత్రి పదిగంటలదాకా బాతాఖానీ వేసేం.

లలిత అప్పుడు నిద్రపోయింది. నాకింకా నిద్రపట్టడంలేదు. పెరీ మేసన్ మిస్టరీ ఒకటి తీసి చదవడం ఆరంభించేను. సుమారు పన్నెండవుతోంది. ఎదురుగా బెర్తు మీద పడుకున్న లలితవైపు చూసేను. ఆమె ఏదో తియ్యని కలలో నవ్వుకుంటోంది. కిటికీలోంచి వీస్తున్న చల్లటిగాలికి చలివేసి వళ్లంతా ముడుచుకొని నిద్రపోతోంది. ఆమె ముంగురులు చెదిరి మొఖంమీద ఆడుకుంటున్నాయి. నా బెడ్డింగులోంచి ఒక శాలువతీసి ఆమెకు కప్పేను. ఆ రాత్రి ఆమె నవ్వుకుంటున్న ముఖాన్ని చూస్తూ అలానే ఎప్పుడో నిద్రపోయేను. కలకత్తా ప్లాటుఫారంమీదికి బండీ చేరుతుంటే ఆమె నన్ను లేపింది. గబగబా నా సామానంతా సర్దుకున్నాను. "నిన్న రాత్రి మీరు కప్పిన శాలువకి థాంక్స్" అంది నవ్వుతూ. ఆమె అలా అనడం నా కెంతో బావుంది. బయటికి మాత్రం "దానికేంలెండి" అన్నాను. సామానంతా పట్టించి "బస్సుస్టాండుకి పద" అన్నాను కూలీని. "అదెక్కడికి?" అంది. "పదండి చెప్తాను" అన్నాను. ఆమెకేమీ తోచలేదు. అయినా నా వెంటే బస్సెక్కింది. కాలేజ్ స్ట్రీట్ క్రాసింగ్ దగ్గర దిగి చిన్నన్నయ్య ఇంటికి వెళ్లి తలుపుతట్టేను. బిస్వా తలుపుతీసేడు. హిందూస్తానీలో నన్ను పలకరిస్తూ సామానంతా లోపల పట్టించేడు - చిన్నన్నయ్య "ఈమెవరు?" అన్నాడు. చెప్పేను. "కూర్చోండి" అన్నాడు. స్నానం, భోజనం, నిద్ర అయినతర్వాత "పోతాం" అన్నాను. "అదేమిటిరా? ఆవిడకి ఊరు చూపించవ్?" అన్నాడు "ఇప్పుడుకాదు మళ్లీ అట్నుంచి వస్తున్నప్పుడు." ఆ రాత్రల్లా రైల్లో నాకు నిద్దరపట్టలేదు. చింతనిప్పుల్లాగ ఉన్న కళ్లతో తెల్లవారు ఝామున నాలుగున్నరకి బరంపురంలో దిగేను. "నే నేనాడు బయలుదేరతానో మీకు ఉత్తరం రాస్తాను. తప్పక అదే బండికి వస్తారుకదూ?" అంది లలిత. అంతేగాని తన చిరునామా నాకివ్వలేదు. నేనూ ఆమె పరిస్థితి అర్థంచేసుకొని అడగలేదు. చలికి కోటుకాలరుతో చెవులు కప్పుకుంటూ ఆమెదగ్గర సెలవు తీసుకొని గేటువైపు నడిచేను.

సెలవుల్లో పద్మ ఒక ఉత్తరం రాసింది. "......నువ్వు మునుపటి బావవు కావు. నా ఉత్తరాలకి సరిగ్గా జవాబు రాయడంలేదు. నేను నీకిప్పుడంతగా జ్ఞాపకం రావడంలేదూ?..." అంటూ. ఇది నిజమే? నిజంగా నేను పద్మని మర్చిపోతున్నానా? లలితమీద నాకీ ఆపేక్ష ఎందుకు? ఈ వెఱ్ఱి బాగుల్ది ఇంత పిచ్చిగా నాకు రాస్తుంది! లలిత క్షేమంగా చేరినట్టు అయినా నాలుగు ముక్కలు రాయదు! ఈ రాని లేఖలకోసం నాకెందుకీ ఆందోళన? నన్ను పూర్తిగా మర్చిపోయి, నే నెవరినో గుర్తించని ఆ వ్యక్తిని గురించి నాకెందుకీ ఆలోచనలు? ఇలా అనుకుంటూనే లలిత టెలిగ్రాం చూసి ఆరోజు మెయిలుకి నేనూ హాజరయేను. నాకోసం ఓ బెర్తు ఖాళీ చేయించి ఉంచింది. "మీకోసం మైసూర్ పాక్ తెచ్చాను" అంది. అవి ఎంతో రుచిగా ఉన్నాయి నాకు. ఆ రాత్రల్లా నాకు ఏదో వాళ్ల ఊరి గొడవలు చెప్తూనే ఉంది. మేం పడుకొనేసరికి రాత్రి రెండుగంటలయింది. కలకత్తాలో రెండురోజులుండి వెళదాం అన్నాను. సరేనంది. మొదటిరోజున ఊరంతా చూపించేను. రెండోరోజున ఇద్దరం మెట్రో సినిమాకి పోయాం. "నాకు కొంచెంకూడా అర్థమవడం లేదే!" అని

ఆశ్చర్యపడింది, తను నేర్చుకున్న ఇంత ఇంగ్లీషు భాషా వృధాయేనా అన్నట్టు. "హౌనీ హాలు చూసేవుగా?" అన్నాను. నే నామెను ఏకవచనం ప్రయోగించడం అదే మొదటిసారి. పిక్చరయిపోయింది. "క్షమించండి" అంటూ నా పక్క సీటులో ఆయన ఆమెతో తెలుగులో అన్నాడు. "నే నెవరినో తెలుసా?" ఇద్దరం అలాగే ఆశ్చర్యంగా నిల్చిపోయేం.

లలిత తెలీదని తలఊపింది. "నేను మీ పిన్నిగారికి వరసకి తమ్ముణ్ణి అవుతాను. ఇక్కడ యం. బి. బి. యస్. చదువుతున్నాను" "మీ పేరు..." "గోపాలరావు. నిన్నిక్కడ కలుసుకోడం నా కెంతో ఆనందంగా ఉంది" అన్నాడాయన. కాని లలితమాత్రం అటువంటి భావం ఏదీ వ్యక్తం చెయ్యలేదు.

"నా లాడ్జి చూపిస్తాను వస్తావా?" అన్నాడు. రానంది.

"ఏం? ఇక్కడికి చాలా దగ్గర"

"మాకు మరో ప్రోగ్రాం ఉంది, ఈ సాయంకాలానికి" అన్నాను నేను. ఆయన నావేపు కొరకొరా చూసేడు.

"నే నామె బంధువుని" అన్నాడు.

"నే నామె గార్డియన్" అన్నాను నేను. లలిత నావేపు చూస్తూ "పదండి పోదాం" అంది. ఆయన నాతో ఆఖరుసారిగా అన్నాడు. "ఇదిగో మిష్టర్ మీ రెవరో నాకు తెలియదు. కానీ మీ ప్రవర్తన నాకేమీ బాగోలేదు. ఈమెను మీ రిలా కలకత్తాలో దింపేరని, సినీమాలకీ, షికార్లకీ తిప్పుతున్నారనీ వీళ్ల నాన్నగారికి ఈ వేళ రాస్తాను."

"మీ అక్కయ్యగారికి రాయండి దాని కప్పుడు యింకా ఎక్కువ విలువుంటుందని" అన్నాను నేను. ఆయన కోపంగా అడుగులు వేసుకుంటూ మళ్ళీ వెనక్కి తిరక్కుండా అక్కడనుంచి వెళ్ళిపోయేడు. ఆ సాయంకాలమంతా ఎక్కడెక్కడో తిరగేంగాని ఇద్దరం ఏదో కొద్ది కలవరంతో బాధపడ్డాం.

ఆ రాత్రే రైలెక్కేం. ఆమె ఒక బెర్త్ మీద నిద్రపోయింది. నాకు నిద్రపట్టలేదు. ఏవేవో దృశ్యాలు కళ్లముందే నాట్యమాడుతున్నాయి. నా జీవితం ఎటుపోతోంది? నే నేం చేస్తున్నాను? "పద్మా! నన్ను క్షమించవూ?" అనుకున్నాను నాలో. ఓ చామనచాయ ముఖం, జీవితంలో ఏదో పోగొట్టుకున్న నయనాలూ... "లేదు. లేదు. నీ ఆనందంకోసం నా జీవితం అన్నా త్యాగంచేస్తాను. కాని నీ నయనాల్లో దైన్యాన్ని తొలగించు. నేను చూడలేను. ఆ నయనాల్తో ఒక్కసారి నవ్వవూ?"—అంతా మాయమయింది. నాచుట్టూ మంచు. మంచంతా కరిగింది. మంచులో ఉన్న మోడు చిగురుస్తోంది. కాని కరిగిన మంచులో నేను కొట్టుకుపోతున్నాను. ఎక్కడికో? చుట్టూ చీకటి......

మేము విశ్వవిద్యాలయం చేరిన పదో రోజున లలిత నా గదిలోకొచ్చి "మా నాన్నగారు నాకో ఉత్తరం రాసేరు. వెంటనే బయలుదేరి రమ్మని" అంది. ఆశ్చర్యంతో నాకళ్లు పెద్దవయాయి. "నువ్విక్కడికొచ్చి ఇంకా పదిరోజులేగా అయింది?" అన్నాను.

"అవును" అంది. కొన్ని నిముషాలు ఎవరూ మాట్లాడలేదు.

"మళ్ళీ ఎప్పుడు వస్తావు?"

"మరి రాను"

"లలితా! నీకేమైనా పిచ్చి ఎత్తిందా?"

లలిత తల అడ్డంగా ఆడించింది.

"మరి రానంటావేమిటి?"

"ఏమోకాని నేను మళ్లా రానని నాకు బాగా తెలుసు."

"నీ ధోరణి నాకు అర్థం కావడంలేదు."

"నేను మా నాన్నతో పందొమ్మిదేళ్లు గడిపేను. ఆయనతో మాట్లాడుతున్నప్పుడే కాదు; ఆయన ఉత్తరాల్లోకూడా ఆయన్ని నేను బాగా అర్థం చేసుకోగలను. మనకి కలకత్తాలో నాలుగుకళ్ల విగ్రహ మొకటి మెట్రోలో దర్శనమివ్వలేదూ! దాని ఫలితం ఇది. నేనో పిచ్చిదాన్ని. జీవితం అంతా కష్టం సుఖం అనేవి రెండూ సమభాగాలని యిప్పటిప్పుడే అనుకున్నాను. కాని అది తొంభై పాళ్లు కష్టం; పదిపాళ్లే సుఖం అని నాకు ఈ వేళే తెలిసింది. నాకు తెలుసు. మీరు నాజీవితంలో మళ్ళీ ఆనందరేఖలు వికసింప చేయాలని చాలా ప్రయత్నం చేసేరు. కాని నావంటి శాపగ్రస్తులికి అది బూడిదలో పోసినపన్నీరే అయింది" అంది. దుఃఖిస్తూ.

"ఎందుకు అనవసరంగా ఏడుస్తావు? ఏమీ లేనిదానికి. ఊరికే ఖంగారుపడ్డ మెందుకు? కులాసాగా వెళ్ళు. ఆసం లేమిటో కనుక్కొని మళ్ళీ వచ్చేయ్యగ అన్నాను.

ఆ రాత్రి 'బంగారు'తో ఈ సంగతి చెప్పేను. వాడు "ఏమో! నాకు ఈ వ్యవహారం అనుమానంగానే ఉంది" అన్నాడు.

మర్నాడు రైలెక్కించిన తర్వాత లలితతో "ఏమైనా చిక్కుల్లో పడ్డావంటే నాకు వెంటనే టెలిగ్రామ్ ఇయ్యి" అన్నాను.

"అది అసాధ్యం. మాఇంటిసంగతి మీకు తెలియదు" అంది. బంగారువైపు తిరిగేను. వాడు తల అటు తిప్పేసుకున్నాడు. నా

బస్సులో: "ఏమండీ! కండక్టరు గారూ! నేను ఈబస్సులో ఏ చివర నుండి దిగవచ్చు?"

"ఏ చివరైనా ఫరవా లేదండి. రెండూ ఒక్కసారే ఆగుతాయి"

గుండె ఏమిటో బరువుగా ఉంది. నా గొంతు బొంగురుపోయింది.

"లలితా! నువ్వు మళ్ళీ రాకపోతే నే నేమౌతానో నాకే తెలియదు" అన్నాను. లలిత కళ్లలో నీళ్లు తిరిగేయి.

"నాకు తెలుసు. ఈ జన్మలో కాకపోయినా మరోజన్మలోనైనా..." రైలు కేమగా అరిచి కదిలిపోయింది.

నాకప్పుడొకసారి అనిపించింది నిజంగా మరి లలిత రాదేమో! ఆమెను నేను ఇంటికి వెళ్లమనడంలో చాలా పొరపాటు చేసేను. ఈ జీవితంలో ఆమె కెవరూ లేరు. ఆమె బ్రతుకు ఉత్త చీకటికోణం. ఆమెను అంతగా ఓదార్చేను. ధైర్యం చెప్పేను. కాని 'వెళ్ళొద్దు; ఇక్కడే ఉండిపో' అని అనలేకపోయాను. నేనింత పిరికివాణ్ణా! లేక నా హృదయంలో ఈ వ్యక్తికి స్థానం లేదా? నే నిప్పుడేం చెయ్యను? నా ఎదురుగా జరుగుతున్నది ఇదంతా కలా! నిజమా! కలా....నిజమా? దూరంగా రైలు నల్లటి మచ్చగా కనుపించింది. క్రమంగా నాదృష్టికి అంతా నల్లగా అయిపోయి మరేమీ కనిపించలేదు.

నేను మళ్ళీ ఈలోకంలో పడేసరికి నా మంచంమీద ఉన్నాను. పక్కని బంగారు కూర్చున్నాడు. గదంతా చీకటిగా ఉంది. "బంగారూ! లైటు వెలిగించవ్!" అన్నాను నీరసంగా. "లైటు వెలిగే ఉందే" అన్నాడు. నాకామాటలు ఏవో నూతిలోంచి వినిపిస్తున్నయ్. "బంగారు! లలితమీద నాలో లేని ఊహల్ని రెచ్చగొట్టి నువ్వెంత పొరపాటు చేసేవు. నువ్వు నాకామెచరిత్ర చెప్పిన ఆచీకటి రాత్రి ఎంత పాపిష్ఠిది! ఈ మహా నేరం నామనస్సుని పీడిస్తుంటే ఎలా జీవించేది? నాకీలోకంలో ఆశించదగింది ఏదైనా ఉందా? ఆ పడవవాడు గంగను ప్రేమించేడు. వాడు నాకన్న ఎన్నిరెట్లు అదృష్టవంతుడు! లలితా! ఈ నిర్భాగ్యుణ్ణి క్షమించవూ..."

తరువాత ప్రతిరోజూ లలితకోసం ఎదురుచూస్తున్నాను. పోష్టుమాన్ని రోజూ టెలిగ్రాం వచ్చిందా అని అడుగుతాను. కాని నాకే టెలిగ్రాం రాలేదు. లలిత తిరి మరి రాలేదు.